

అపూర్వ సమ్మేళనం 8లో

65 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నవిద్యార్థులు వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం కలుసుకున్నారు.



చింతపండుకు భలే డిమాండ్

దేవరాపల్లిలో ఆదివారం జరిగిన వారపు సంతలో చింతపండు హాట్‌కేకుల్లా అమ్ముడైంది. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి

ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
6.12	4.43

నర్సీపట్నం

ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
6.16	4.41

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం

24 గంటలూ అందుబాటులో

ఫోన్: 08924-226599

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమాండ్ కంట్రోల్ కేంద్రం నోడల్ అధికారి, మత్స్యశాఖ డీడీ పి.ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులున్నా 08924-226599 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1950 కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రోజంతా ఈ కేంద్రం ఫిర్యాదులను స్వీకరిస్తుందని పేర్కొన్నారు.

టీడీపీ అభ్యర్థి సమావేశానికి గవిరెడ్డి, పీవీజీ వర్గీయుల డుమ్మా

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండలో టీడీపీ మండల స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. మాడుగుల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పైలా ప్రసాదరావు హాజరైన తొలి సమావేశానికి ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.వి.జి.కుమార్ గైర్హాజరయ్యారు. గవిరెడ్డి, పి.వి.జి. వర్గీయులుగా ముద్ర పడిన మండలంలోని ముషిడిపల్లి, చిననందిపల్లి, కె.ఎం.పాలెం, పెదనందిపల్లి, తెనుగుపూడి, కాశీపురం తదితర గ్రామాల నుంచి టీడీపీ ముఖ్య నాయకులు సైతం డుమ్మా కొట్టారు. సమన్వయం పేరిట నిర్వహించిన సమావేశానికి ముఖ్య నాయకులు హాజరు కాకపోవడంపై పార్టీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేశాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇంకా పార్టీ నాయకులు గ్రూపులు కొనసాగిస్తుండడంపై కేడర్ బాహాటంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు ప్రారంభం



నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి జాతర, కొత్త అమావాస్య పండగ చాటింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా ఘటాల ఊరేగింపును ప్రారంభించినట్లు చెప్పారు. పండగ రోజు వరకు ఘటాలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. చాటింపు, ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పీడీ దేవికి వెండిపతకం



పతకాలు గెలుచుకున్న విజేతలతో పీడీ దేవి

నర్సీపట్నం: ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గుడివాడ దేవి వెండి పతకాన్ని సాధించారు. న్యూఢిల్లీలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొన్నారు. 87 కిలోల కేటగిరీ మహిళా విభాగంలో ఆమె ప్రతిభ కనబరిచి పతకం సాధించించారు. నింజాస్ అకాడమీ మెంబర్‌గా పిల్లలకు ఆమె శిక్షణ ఇస్తున్నారు. నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, సుమ, నాగజ్యోతి తదితరులు ఫిజికల్ డైరెక్టర్ దేవిని అభినందించారు.

అమెరికా నౌకకు ఘన స్వాగతం



సింథియా(విశాఖ): టైగర్ ట్రయాంఫ్-2024లో పాల్గొనేందుకు యూఎస్‌కు చెందిన అర్లీ–బుర్క్ క్లాస్ గైడెడ్–మిసైల్ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ హాల్సే(డీడీజీ 97) విశాఖపట్నం చేరుకుంది. ఈ నౌకకు భారత నావికాదళం ఘన స్వాగతం పలికింది. విశాఖలో భారత్, అమెరికా సంయుక్తంగా యుద్ధ విన్యాసాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

చదువుకు ఊపిరి.. అమ్మఒడి

ఆర్థిక పరిస్థితి కారణంగా ఏ ఒక్క పేద విద్యార్థీ చదువుకు దూరం కారాదు. పనికి పంపే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని బడికి పంపాలి. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. పిల్లల్ని బడికి పంపే తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు చొప్పున జమ చేశారు. నాడు–నేడు పథకంలో ఓ పక్కన స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తూనే, బడిబయట పిల్లలు కూడా బడిలో చేరేలా అమ్మఒడి పథకాన్ని పైసా అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేశారు.

- పేదింటి పిల్లల చదువులకు కొండంత అండ
- అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న అమ్మఒడి
- ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు మంజూరు
- నాలుగు విడతల్లో జిల్లాలో రూ.948.63 కోట్లు విడుదల
- ప్రతి విద్యార్థికీ రూ.60 వేలు చొప్పున లబ్ధి



నవశకం సంక్షేమ సంతకం

సాక్షి,అనకాపల్లి/కొంకోట/బుచ్చెయ్యపేట/చీడికాడ:వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం ఓ విద్యా విప్లవం. విద్యారంగం సంస్కరణల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తెచ్చిన ఈ పథకాన్ని దేశమంతా ప్రశంసించింది. ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ విద్య అందితే, రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన సీఎం జగన్ ఆ దిశగా అవసరమైన ప్రతి చర్యనూ తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమైన వారంతా అమ్మఒడి ఉందనే ధీమాతో బడిబాట పడుతున్నారు. ఇందుకు నిదర్శనం 2019 నుంచి 2023 వరకు ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యే.

అమ్మ ఒడికి అర్హతే ప్రామాణికం

విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించాలనే ఉన్నతాశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమ్మ ఒడి పథకాన్ని అమలుచేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నప్పటికీ అమ్మఒడి మంజూరు చేస్తున్నారు. పథకం పారదర్శకంగా అమలు చేసే క్రమంలో సచివాలయం స్థాయిలో లబ్ధిదారుల బయోమెట్రిక్ అథంటికేషన్(ఈకేవైసీ)తో ఆధార్‌కార్డు అనుసంధానించిన బ్యాంక్ ఖాతాకు డబ్బులు జమ చేస్తున్నారు. మధ్యవర్తుల బెడద, పైసా అవినీతి లేకుండా, నేరుగా లబ్ధిదారులకు డబ్బులు అందుతున్నాయి.

ఒక్కో విద్యార్థికి రూ.60 వేలు లబ్ధి

ఏటా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న సగటున 1.50 లక్షల నుంచి 1.60 లక్షల మంది విద్యార్థులకు అమ్మ ఒడి డబ్బులు అందాయి. ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రతీ విద్యార్థికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొత్తంగా రూ.60 వేల లబ్ధి చేకూరింది. ముందస్తు షెడ్యూల్ మేరకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మరో రూ.15 వేలు ఈ వేసవి సెలవుల అనంతరం బడి తెరిచిన మొదటి రోజునే తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏటా క్రమం తప్పకుండా అమ్మఒడి పథకం ద్వారా పేద విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని విద్యారంగ నిపుణులు చెప్తున్నారు.

విద్యాకానుకతో ధీమా

జగనన్న విద్యాకానుక పథకం క్రింద ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, షూస్, సాక్స్, మూడు జతల యూనిఫాం(కుట్టుకూలితో సహా) ఇలా తొమ్మిది రకాల వస్తువులను ఇస్తున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.1,964.

జిల్లాలో అమ్మ ఒడి లబ్ధి

సంవత్సరం	విద్యార్థులు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,61,915	242.87
2020-21	1,60,914	241.37
2021-22	1,58,722	238.00
2022-23	1,50,870	226.30

పిల్లల చదువుపై బెంగ లేదు



నా పేరు బోదాల లక్ష్మి. మాది చీడికాడ మండలం అర్జునగిరి గ్రామం. మాకు ఇద్దరు మగ పిల్లలు. పెద్దబ్బాయి పవన్ కె.కోటపాడు మండలంలోని ఎ.కోడూరు ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో 9వ తరగతి, రెండవ కుమారుడు వినయ్ తురువోలు ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. జగనన్న సీఎం అయిన దగ్గర నుంచి ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు అమ్మఒడి కింద గడచిన నాలుగేళ్లలో రూ.60 వేలు లబ్ధి చేకూరింది. నేరుగా నా బ్యాంక్ ఖాతాలోనే డబ్బులు జమయ్యాయి. నా భర్తకు దివ్యాంగ పింఛన్ ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున వస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకంలో డ్వాక్రా రుణమాఫీ కింద రూ.6 వేలు అందాయి. మా ఆయన ఆటో డ్రైవర్. తనకు వాహనమిత్ర పథకంలో వరుసగా ఐదేళ్లు ఏడాదికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.50 వేలు లబ్ధి చేకూరింది. వీటితోపాటు రైతు భరోసా పథకంలో ఏటా రూ.13,500 చొప్పున ఇప్పటి వరకు రూ.67,500 అందింది. దీంతో జగనన్న ప్రభుత్వంలో అర్హతలున్న మేరకు అన్ని సంక్షేమ పథకాలూ అందాయి. వీటి కోసం ఎవరి చుట్టూ ప్రదక్షిణలు చేయలేదు. వలంటీర్ మా ఇంటికే వచ్చి, పథకాలకు మా పేరు నమోదు చేసుకుని, లబ్ధి చేకూర్చారు. జగనన్న ప్రభుత్వంలో గవర్నమెంట్ స్కూళ్లు చాలా బాగున్నాయి. మా పిల్లల చదువుపై ఎలాంటి బెంగ లేదు. చాలా ఆనందంగా ఉన్నాం.

సర్కారీ విద్యార్థులకు విద్యా కానుక

సంవత్సరం	విద్యార్థులు	వ్యయం (రూ.కోట్లలో)
2020-21	3,17,202	48.54
2021-22	3,17,209	48.56
2022-23	3,69,733	61.66

అమ్మఒడి వల్లే మా పాప చదువు



నా పేరు బోడి మాధవి. బుచ్చెయ్యపేట మండలం నేతవాని పాలెం మాది. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. మా ఇంటాయన అప్పారావు. మాకు ముగ్గురు పిల్లలు. అందులో ఇద్దరు ఆడపిల్లలు. మాకున్న 40 సెంట్ల పొలంలో వ్యవసాయం చేస్కుంటూ, మేకల్ని మేపుతూ బతుకుతున్నం. వర్షాలు కురిస్తేనే పంట పండుతాది. తిండిగింజలకే సేనా ఇబ్బందులు పడేటోల్లిమి. పెద్ద కూతురు తేజశ్రీ పుట్టడమే అదేదో జబ్బు(తలసేమియా)తో పుట్టినాది. బడ్లో ఏయకూడదనుకున్నం. అమ్మఒడి పథకంలో డబ్బులు, బట్టలు, పుస్తకాలు ఇస్తున్నారని బడ్లో ఏశాం. ఏటా రూ.15 వేలు ఇస్తన్నరు. బడ్లేకే పంపం అనుకున్న నా కూతురు ఇపుడు మూడో క్లాసులోకి వచ్చింది. అచ్చరాలు కూడా చదువుతంది. వైఎస్సార్ బిడ్డ జగనన్న సీఎం అయ్యాక మా ఇబ్బందులు చాలా వరకు తీరాయి. పాపకి నెలకి రూ.10 వేలు పింఛన్ కూడా వత్తంది. మా కుటుంబానికి జగనన్న అండగా నిలిచారు. ఈ పెబుత్వం లేకపోతే మా బతుకులు ఏటైపోయేవో తల్చుకుంటేనే బయమేత్తంది. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, పింఛన్, ఆసరా పథకాల డబ్బులు మా బేంకు ఎకౌంట్లో పడ్డాయి. ఐదేళ్లలో ఈ పెబుత్వం వల్ల రూ.9.16 లచ్చలు మేలు కలిగింది. మాలాంటోళ్ల బతుకులు బాగుండాలంటే కలకాలం జగనన్నే సీఎంగా ఉండాల.

పేదలపాలిట వరం



నా పేరు వంకర నాగమణి. కొంకోటలోని ఇందిరా కాలనీలో నివాసం ఉంటున్నాం. ఓ ప్రైవేట్ స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నా. భర్త రాము స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పరిశ్రమలో కూలీ. మాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె ధనుశ్రీ స్థానిక బాలికల హైస్కూల్లో 5వ తరగతి చదువుతోంది. కొడుకు రామ్‌చరణ్ డీపీఎస్ జెడ్పీ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం అందిస్తోన్న అమ్మఒడి పథకంలో కుమార్తె ధనుశ్రీ పేరిట ఏటా రూ.15 వేలు చొప్పున లబ్ధి చేకూరుతోంది. వరుసగా నాలుగేళ్లపాటు రూ.60 వేలు బ్యాంక్ ఖాతాకు జమ అయింది. అరకొర ఆదాయంతో బతుకీడుస్తోన్న మాకు పిల్లల పోషణే కష్టంగా ఉన్న పరిస్థితి. వీరికి మంచి చదువులు ఇప్పించడం ఎలా? అన్న బాధ ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ బెంగ లేకుండా పోయింది. పిల్లల చదువులకు అవసరమైన అన్ని వస్తువులూ ప్రభుత్వమే అందిస్తోంది. యూనిఫాం, బూట్లు తొడుక్కుని పిల్లలు స్కూల్‌కు వెళ్తుండటం చూస్తుంటే.. ఆ ఆనందం ఎలా చెప్పగలను. సీఎం జగన్.. మాలాంటి పేద బతుకుల పాలిట దేవుడు.

జిల్లాలో విద్యా సంస్థలు

ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు	మొత్తం పాఠశాలల విద్యార్థులు
1,887	2,22,797

జూనియర్ కళాశాలలు	మొత్తం కళాశాలల విద్యార్థులు
133	29,620

వేడుకగా నాగవల్లి వసంతోత్సవం

- వడ్డాదిలో ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం
- భారీ బందోబస్తు మధ్య స్వామి వారి ఊరేగింపు



వడ్డాది మెట్లు మార్గంలో భక్తుల రద్దీ



శ్రీదేవి,భూదేవి,వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవాన్ని ఆదివారం వైభంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి 151వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు జరిగిన నాగవల్లి వసంతోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేంకటేశ్వరస్వామి కొలువైన గిరిజాంబ కొండకు వెళ్లే రహదారులన్నీ భక్తులతో రద్దీమారాయి. గోవింద నామ స్మరణతో వీధులన్నీ మార్మోగాయి. కొండపై నుంచి వేంకటేశ్వరస్వామి,శ్రీదేవి,భూదేవి ఉత్సవ విగ్రహాలను కొండ దిగువకు తీసుకువచ్చి ప్రత్యేకంగా తయారు చేయించిన రథంపై ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో వడ్డాది వీధుల్లో తిరువీధి, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు వసంతాన్ని జల్లుకుని ఆనందంతో పులకించారు. రథం లాగడానికి, వసంతం జల్లడానికి భక్తులు పోటీ పడ్డారు. ఇటీవల వడ్డాదిలో కొంతమంది యువకుల మధ్య జరిగిన గొడవల కారణంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా వసంతోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఊరేగింపు సమయాన్ని కుదించారు. మధ్యాహ్నం వడ్డాది శారదా నదిలో ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు అన్నయ్య కుమారుడు శ్రీరామ్ శిరస్సుపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి చక్ర స్నానం నిర్వహించారు.ఈవో శర్మ తదితరులు పాల్గొన్నారు. అదే సమయంలో పలువురు భక్తులు శారదా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ విగ్రహాలను గిరిజాంబ కొండ పైకి చేర్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ ఈశ్వరరావు 80 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి బాణసంచా కాల్చారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గణేష్



ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో పార్టీలోకి చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి, అమలాపురం, మాకవరపాలెం మండలం కొత్తపాలెం గ్రామాలకు చెందిన వంద మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబరు మంజేటి నూకరాజు, మాజీ ఎంపీటీసీ చెల్లూరి అప్పారావు, మెపాడ సత్యవతి, మాకిరెడ్డి రాజుబాబు, ఏకా నాయుడు, లాలం తాతారావు, పైల తాతీలు, ఎం.దేముడు, అప్పలనాయుడు, మోపాడ కిరణ్, కలిమి రమణ, బంటు శ్రీను, నవర వెంకటేష్, నవర నారాయణమూర్తి, అప్పికొండ జోగిరాజు తదితరులున్నారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ అంతా కష్టపడి పని చేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రజల ఆశీస్సులతో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అవుతారని, తాను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుస్తానని చెప్పారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతుందన్నారు. మరో 40 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరనున్నారని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, ఏకా శివ, యూత్ అధ్యక్షుడు దన్నిన నానాజీ, ఎంఎల్‌వో సుర్ల చంద్రశేఖర్, మాకవరపాలెం ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయం.. మరువలేం

- హార్బర్‌లో బోట్ల ప్రమాద బాధితులకు మూడు రోజుల్లోపే పరిహారం
- రూ.7.11 కోట్లు అందించి ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కన్నీళ్ల స్థానంలో పెల్లుబికిన ఆనంద బాష్పాలు
- సీఎం జగన్ సాయాన్ని మరవబోమంటున్న మత్స్యకారులు



బాధిత మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీలు మోపిదేవి, ఎంవీవీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, వాసుపల్లి, నాగిరెడ్డి (ఫైల్)



సాక్షి, విశాఖపట్నం : పార్టీలను చూడలేదు.. పక్షపాతమూ చూపలేదు.. బాధితులను ఆదుకోవాలన్న దృఢ నిశ్చయం. అదే సంకల్పంతో ఫిషింగ్ హార్బర్ బోట్ల దగ్ధం ప్రమాద బాధితులకు గంటల వ్యవధిలోనే పరిహారాన్ని అందించారు. ఆ పరిహారం మొక్కుబడిగా కాదు.. వారు ఊహించనంత.. ఉక్కిరి బిక్కిరయ్యేటంత! దీంతో ఈ మత్స్యకారులంతా కష్టకాలంలో తక్షణమే తమను ఆదుకున్న దేవుడంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కొనియాడుతున్నారు. ఆయన చేసిన సాయాన్ని మరవబోమంటున్నారు. ఆయనకు ఎల్లప్పుడూ అండగా ఉంటామంటున్నారు. గత ఏడాది నవంబరు 19వ తేదీ అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు ఆహుతయ్యాయి. వీటిలో 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో తమ పట్ల ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని బాధిత మత్స్యకారులు ఎంతగానో కలత చెందారు. రూ.లక్షల విలువైన మరపడవలు కాలి పోవడంతో తమ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళనకు గురయ్యారు. పిల్లాపాపలతో రోడ్డెక్కి రోదించారు. జరిగిన నష్టంలో ఎంతో కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటారేమోనని భయపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఈ ప్రమాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూశారు. ఈ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సాయం చేయదంటూ బాధితులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. కానీ బాధితుల భయాందోళనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెనువెంటనే స్పందించి అత్యంత ఉదారమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.

పరిహారం.. అనూహ్యం

వాస్తవానికి జరిగిన నష్టంలో 50 శాతానికి మించి ప్రభుత్వం పరిహారం ఇవ్వదని భావించారు. అయితే సీఎం జగన్ ఏకంగా 80 శాతం సొమ్ము చెల్లించే సరికి బాధిత మత్స్యకారుల ఆనందానికి అవధుల్లేవు. ప్రతిపక్ష నాయకుల నోట నుంచి మాటల్లేవు. అప్పటిదాకా కన్నీళ్లు ఉబికిన బాధితుల కళ్ల నుంచి ఆనందభాష్పాలు కురిశాయి. తాము ఊహించిన దానికంటే ఎక్కువ పరిహారం ఇచ్చారని కొనియాడుతున్నారు. ఇప్పుడు వీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ పాలిట దేవుడని, జీవితాలు నిలిపిన ఆయనకు జీవితాంతం అండగా ఉంటామంటున్నారు.

తక్షణమే స్పందించిన సీఎం

ప్రమాదం జరిగిన వెంటనే సీఎం జగన్ ఉన్నత స్థాయి అధికారులను రంగంలోకి దించారు. మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును హార్బర్‌కు పంపారు. బోట్ల దగ్ధంతో మత్స్యకారులకు వాటిల్లే నష్టాన్ని అంచనా వేయించారు. నష్టంలో 80 శాతం మొత్తాన్ని పరిహారంగా చెల్లిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతేకాదు బాధిత మత్స్యకారులకు వెంటనే పరిహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఆగమేఘాలపై బాధితుల జాబితాను రూపొందించారు. 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా దగ్ధమైనట్టు తేల్చారు. మూడు రోజుల్లోనే బోటు విలువలో 80 శాతం సొమ్మును పరిహారంగా బాధితులందరికీ చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మొత్తం 7.11 కోట్ల మొత్తాన్ని అందజేశారు. దీంతో పరిహారంపై వీరికున్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. అలాగే అగ్ని ప్రమాదంలో కాలిపోయిన బోట్లపై ఆధారపడిన 400 మంది కలాసీల (వర్కర్ల)కు కూడా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించారు.

సాయం మరచిపోం



బోటు కాలిపోయింది.. ఇక జీవితాలేమవుతాయోనని ఆందోళన చెందిన మాకు సీఎం జగన్ భారీ పరిహారమిచ్చి ఆదుకున్నారు. హార్బర్‌లో కాలిన మా బోటు (వీ–5ఎంఎం-836)కు రూ.23.20 లక్షల పరిహారం అందింది. రూ.28 లక్షలతో ఓ పాత బోటు కొని రీమోడల్ చేయించుకుంటున్నాం. సీఎం జగన్ మేలు మరచిపోం. ఆయన మళ్లీ సీఎం కావడానికి పాటుపడతాం.

– వాసుపల్లి ఎల్లమ్మ, బాధిత బోటు యజమాని, రెల్లివీధి

అంత పరిహారాన్ని ఊహించలేదు



దగ్ధమైన నా బోటు (వీ–5ఎంఎం 167)కు సీఎం జగన్ రూ.20.40 లక్షలు చెల్లించారు. ఇంత పరిహారం ఇస్తారని మేం కలలో కూడా అనుకోలేదు. పైగా మూడురోజుల్లోపే చెక్కులు చేతికిచ్చారు. ఈ డబ్బుతో బోటు కొనుక్కుని నెల రోజుల్లోనే తిరిగి వేట ప్రారంభించాం. సీఎం జగన్ చేసిన సాయానికి జీవితాంతం రుణపడి ఉంటాం. వచ్చే ఎన్నికల్లో తామంతా ఆయనకు అండగా నిలుస్తాం.

– మైలపిల్లి చిన్నయ్య, బాధిత బోటు యజమాని

క్లుప్తంగా

వరి కుప్పల దగ్ధం



కాలిపోయిన వరి కుప్పలు

గొలుగొండ: పాత కృష్ణదేవిపేట సమీపంలో బంగారంపేట జాతీయ రహదారి వద్ద ప్రమాదవశాత్తూ మూడు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. వివరాలివి. పాత కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన గొంప శ్రీను, లోవరాజు ఇక్కడ మూడు ఎకరాల్లో వరి పంట వేశారు. ఆదివారం ప్రమాదశాత్తూ ఈ వరికుప్పలు అగ్ని ప్రమాదానికి గురవడంతో సుమారు రూ. 70వేల వరకు ఆస్తి నష్టం వచ్చిందని, అధికారులు పరిహారం అందే విధంగా కృషి చేయాలని రైతులు శ్రీను, లోవరాజు కోరారు. అగ్ని ప్రమాదం విషయం రెవెన్యూ అధికారులకు తెలిపినట్టు చెప్పారు.

ఎర్రవరం శివారులో కోడిపందాల శిబిరంపై దాడి

అచ్యుతాపురం: మండలంలోని ఎర్రవరం శివారులో ఆదివారం కోడి పందాల ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు. రూ.15,600 నగదు, రెండు చనిపోయిన కోళ్లు, ఒక గాయాలతో ఉన్న కోడిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అక్రమ మద్యంతో టీడీపీ నేత అరెస్టు

రాంబిల్లి: లోవపాలేనికి చెందిన చెల్లూరి అమ్మోరు ఆదివారం కొండవారపాలెం జంక్షన్ వద్ద అక్రమంగా 9 మద్యం సీసాలతో పట్టుబడినట్టు సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తుండగా అమ్మోరు వద్ద అక్రమంగా మద్యం సీసాలు లభ్యమైనట్టు సీఐ పేర్కొన్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కాగా లోవపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షునిగా అమ్మోరు వ్యవహరిస్తున్నారు. టీడీపీ అధ్యక్షునిగా ఉంటూ అక్రమ మద్యం కేసులో పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది.

అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్

సాక్షి, అనకాపల్లి: భారతీయ జనతా పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా చింతకుంట మునుస్వామి రమేష్ (సి.ఎం రమేష్)ను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. సీఎం రమేష్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2018లో టీడీపీ నుంచి రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం బీజేపీలో చేరారు.

ఎందరెన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీదే గెలుపు

అనకాపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలాన్ని చూసి టీడీపీ–జనసేన–బీజేపీలు కలసి పోటీ చేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కుట్రలు పన్నినప్పటికీ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు సీఎం జగన్‌కు అండగా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. మండలంలో బీఆర్టీ కాలనీలో వైఎస్సార్‌సీపీ మండలపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆదివారం ఆత్మీయసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తల్లిలాంటి వైఎస్సార్‌సీపీని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మనలో చిన్నచిన్న బేధాభిప్రాయాలు ఉండే పక్కనపెట్టి కలిసికట్టుగా జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. జగన్ బలాన్ని చూసి మూడు పార్టీలు ఏకమై ఓడించడానికి ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే ప్రసక్తి లేదన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకుని చంద్రబాబునాయుడు ఏమి చేస్తారని ఆమె



టీడీపీ-జనసేన నాయకులకు వైఎస్సార్‌సీపీ కండువా వేస్తున్న ఎంపీ సత్యవతి, భరత్‌కుమార్

తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, అవ్వాతాతలకు ఇంటి వద్దకే ప్రభుత్వ పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన మన పేదల ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని ఆమె పేర్కొన్నారు. అర్హులైన లబ్దిదారుల అందరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల్లో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రతి కార్యకర్త గడప గడపకు వెళ్లి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సంపతిపురం గ్రామానికి చెందిన 10 మంది జనసేన, టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి ఎంపీ సత్యవతి, భరత్‌కుమార్‌లు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెప్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, ప్రధాన కార్యదర్శి బీశెట్టి జగన్ పాల్గొన్నారు.

చింతపండుకు భలే డిమాండ్

- రూ.450 నుంచి రూ.700 వరకు పలికిన మణుగు ధర
- హాట్ కేకుల్లా విక్రయం

దేవరాపల్లి: స్థానిక వారపు సంతలో చింతపండుకు మంచి గిరాకీ నెలకొంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే చింతపండుకు ప్రఖ్యాత గాంచిన దేవరాపల్లి వారపు సంతలో తాజా, నాణ్యమైన చింతపండు లభిస్తుండడంతో కొనుగోలు చేసేందుకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి ప్రజలు ప్రత్యేకంగా ఇక్కడకు వస్తారు. ఆదివారం జరిగిన వారపు సంతకు చింతపండు అరకొరగా రావడంతో డిమాండ్ ఏర్పడింది. మణుగు (10 కిలోలు) ధర నాణ్యతను బట్టి రూ.450 నుంచి రూ.700 వరకు పలికింది. గతంలో మణుగు ధర రూ. 350 నుంచి రూ.600 వరకు ఉండేది. పలు ప్రాంతాల నుంచి చింతపండు కొనుగోలుకు అధిక సంఖ్యలో ఇక్కడకు రావడంతో అరకొరగా వచ్చిన



దేవరాపల్లి వారపు సంతలో చింతపండు కోసం ఎగబడిన కొనుగోలుదారులు

చింతపండు గంటల వ్యవధిలోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోయింది. ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గడంతో పాటు వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి చింతపండు కొనుగోలు చేయడంతో వారపు సంతకు చింతపండు రావడం తగ్గిపోయిందని, దీంతో మార్కెట్లో ధరలు పెరిగిపోయాయని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీలో ఉన్న ప్రతి కార్యకర్తకి ప్రత్యేక గౌరవం దక్కేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేశారని, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. గుడివాడ పంచాయతీ శివారు కొత్తపోలవరం, లక్ష్మీపతిరాజుపేట గ్రామాల నుంచి సుమారు 20 కుటుంబాలకు చెందినవారు జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, స్థానిక నాయకులు శ్రీపతిరాజు కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి తామంతా కష్టపడినా విలువ లేదని, పార్టీలకతీతంగా గుర్తింపు ఇస్తున్న వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. పార్టీలో చేరిన వారితో దూళి దుర్గాప్రసాద్, ఎ.వెంకట్, దూళి విజయ్, బాబ్జి, పల్లా అజయ్, రేఖా వెంకటేష్, అవ్వా నవీన్, అవ్వా అశోక్, పోలవరపు చిన్న, నాని, దూళి భారత్, తేజ, ఒమ్మి రోహిత్, శివకోటి శిద్దు, దూళి శ్రీనివాస్, ఇసరపు గోపి, దూళి వెంకటేష్‌లతో కలిసి సర్పంచ్ దూళి శ్రీనుబాబు, అచ్చుత్‌రామరాజు పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

తుమ్మపాల: క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తతతో ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్ బాలాజీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణంలో డీఎల్‌వో కార్యాలయంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్స ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. వారం రోజుల పైబడి దగ్గుతో బాధపడుతున్న వారు క్షయవ్యాధి పరీక్ష చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులతో కలిసి ఎన్టీఆర్ స్టేడియం వరకు మనం టీబీని అంతం చేయగలం



క్షయవ్యాధి నివారణపై ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

, 'టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది' , టీబీ అంతం మనందరి పంతం 'అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

ఎంవీపీకాలనీ: ఇద్దరు ఆటోడ్రైవర్లకు మధ్య మొదలైన తగాదా.. ఓ డ్రైవర్ ప్రాణం తీసింది. వివరాలివి. ఎంవీపీ సెక్టార్–1 చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అనిఫ్ (64) ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఎంవీపీకాలనీలోని స్టాండ్‌లో ఆటో నిలిపి వేచి ఉన్నాడు. మరో ఆటోస్టాండ్‌కు చెందిన డ్రైవర్ ప్రభాకర్ ఆ మార్గంలో వచ్చి ఆటోస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రభాకర్ సెల్‌ఫోన్‌తో అనిఫ్‌ను కొట్టడంతో అతను అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. దీంతో వెంటనే మెడికవర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అనిఫ్ చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై అనిఫ్ కుమారుడు మహ్మద్ అబ్దుల్ ఆజాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

మల్కాపురం: హత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఇల్లాపు హేమ సతీష్ అనే యువకుడు ఊర్వశీ దరి గోకుల్‌నగర్‌లో పాన్ షాపు నడుపుతున్నాడు. శనివారం రాత్రి 10.30 ప్రాంతంలో షాపు మూసేసిన తర్వాత తన స్నేహితుడు వరుణ్‌తో కలిసి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో బంగార్రాజుతో పాటు మరో వ్యక్తి బైకుపై వచ్చి కత్తితో సతీష్‌పై దాడికి దిగారు. వారు తప్పించుకునే క్రమంలో సతీష్ తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నానికి పాల్పడిన బంగార్రాజును ఆదివారం సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఆనాటి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

బుచ్చెయ్యపేట: వారంతా 65 ఏళ్ల కిందట చదువుకుని పదో తరగతి పరీక్షలు తరవాత విడిపోయిన విద్యార్థులు. పలువురు ఉద్యోగాలు పొంది పదవీ విరమణ చేయగా, మరికొంత మంది రాజకీయంగా, పలు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న వారంతా ఆదివారం తాము చదువుకున్న వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో కలుసుకున్నారు. నూనుగు మీసాల కుర్ర వయస్సులో విడిపోయిన వారంతా ఇపుడు తలలు నెరిసిన దశలో కలుసుకుని చిన్న పిల్లల్లా సందడి చేశారు. ఎస్ఐలుగా, తహసీల్దార్‌లుగా, టీచర్లుగా పలు ఉద్యోగాలు, రాజకీయాలు, వ్యాపారాలు చేసిన వారంతా తమ వయస్సును, స్థాయిని పక్కన పెట్టి నాటి స్కూలు పిల్లల్లా కలిసిపోయి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆరోజు నీవు అలా ఉండేవాడివి, ఇపుడేంటిరా ఇలా అయిపోయావు? అంటూ ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కుటుంబ వ్యవహారాలు తెలుసుకుంటూ ఉదయం నుండి రాత్రి వరకు సంతోషంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కమిటీ వేసి గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మెరిట్ సాధించిన విద్యార్థులు వై.గగన్‌తేజకు రూ. 10 వేలు, సందీప్‌కు రూ. 8 వేలు, ఎం.అభిషేక్‌కు రూ. 5 వేలు నగదు అందించి వారి తల్లిదండ్రులను సత్కరించారు. ప్రతి సంవత్సరం మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులతో పాటు పాఠశాల అభివృద్ధి కోసం కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా కోవెల జనార్ధనరావు, అధ్యక్షునిగా సయ్యపురెడ్డి వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా కోవెల రవి, ఉపాధ్యక్షులుగా సయ్యపురెడ్డి వరహాలబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ధర్మజ్యోతి, జాయింట్ సెక్రటరీగా శ్రీనాథ్, రమేష్, కోశాధికారిగా సయ్యపురెడ్డి భాస్కరరావు మెంబర్లుగా బంగారి త్రిమూర్తులు, గరికిపాటి మేఘూరావు, సయ్యపురెడ్డి సత్యనారాయణ, గుద్దేటి పోతురాజు, పినపాత్రుని సాంబశివరావులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



మెరిట్ విద్యార్థులకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చెస్ టోర్నమెంట్ విజేత శ్రావ్యశ్రీ



కన్నూరుపాలెంలో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో బహుమతులు పొందిన విజేతలు



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

కశింకోట: జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఎస్. రాయవరానికి చెందిన బి.శ్రావ్యశ్రీ విజేతగా నిలిచి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. మండలంలోని కన్నూరుపాలెంలో తులసీ కల్యాణ మండపంలో దువ్వూరు బాలకృష్ణమూర్తి జ్ఞాపకార్థం ప్రగతి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ చెస్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆదివారం టోర్నమెంట్ నిర్వహించారు. తాళ్లపాలెంకు చెందిన బి.సాకేత్ ద్వితీయ స్థానం, అనకాపల్లికి చెందిన ఎం. గోపాలకృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1600, రూ.1400, రూ.1200 నగదు, జ్ఞాపికలను ప్రగతి చెస్ అకాడమీ అధ్యక్షురాలు డి.ఎస్. గాయత్రీదేవి అందజేశారు. మరో పది మందికి ప్రోత్సాహక నగదు బహుమతులు, పతకాలు అందజేశారు. జిల్లాలోని సుమారు 80 మంది క్రీడాకారులు టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రిటైర్డ్ పీహెచ్ఎస్ శోభాదేవి, సీనియర్ చెస్ క్రీడాకారులు శ్రీనివాస్, నరసింగబిల్లి రమణ, అయ్యలనాయుడు, చీఫ్ ఆర్బిటర్ డి.వి. సుధీర్‌కుమార్, పీడీ యోఆర్బిటర్లు వి.శ్రీకాంత్, బి.మల్లికార్జునరావు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా అనంతుని రథోత్సవం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముందుగా విశేష హోమం, గ్రామ బలిహరణం, మంగళాశాసనం వంటి పూజాది కార్యక్రమాలు జరిగాయి. తదుపరి కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి విగ్రహాలను పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ రథంపైకి తోడ్కొని వచ్చారు. రథంపై ఉభయ దేవేరులతో ఉన్న అనంత పద్మనాభ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథం ముందు కుంభం (అన్నం) పోశారు. పద్మనాభం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సీహెచ్ శ్రీధర్ ప్రథమ పూజ అనంతరం రథోత్సవం.. కుంతీ మాధవ స్వామి ఆలయ గోపురం నుంచి రాత్రి 11.30 గంటలకు ప్రారంభమైంది. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం రాజవీధి గుండా ముందుకు కదిలింది. ఈవో నానాజీ బాబు పర్యవేక్షణలో రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప పాల్గొన్నారు.



అనంతుని రథం

సంక్షేమ రాజ్యం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

- పాయకరావుపేట అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు
- అట్టహాసంగా ఎన్నికల ప్రచారం ప్రారంభం



శ్రీరాంపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని బ్రోచర్స్‌ను ఓటర్లకు ఇస్తున్న కంబాల జోగులు

పాయకరావుపేట : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అందరూ గెలిపించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శ్రీరాంపురం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైనది. ఈ ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్‌సీపీని విజయపథంలో నడిపించి, మరలా జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. వృద్ధులకు సామాజిక పింఛన్లు, విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, నాడు – నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, ఆసరా, చేయూత, రైతు భరోసా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం తదితర సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హామీలను, వాగ్దానాలను నమ్మవద్దన్నారు. గతంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేసారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల సంగ్రామం పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతుందని, పేదల పక్షా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పోరాటం సాగిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడుతో సహా ఎన్ని పార్టీలు ఏకమైనా సరే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. ప్రచారం ప్రారంభానికి ముందు బీఆర్ అంబేద్కర్, బాబూ జగ జ్జీవన్‌రామ్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద నాయకులకు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులకు పెద్ద ఎత్తున స్వాగతం పలికి, హారతులు ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తామందరం ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా, నక్కపల్లి, ఎస్.రాయవరం పార్టీ అధ్యక్షుడు సీరం నర్సింహమూర్తి, బొలిశెట్టి గోవిందు, ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవవరపు రాజేష్ ఖన్నా, కె.సుందరీలత, మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, మండల బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు పక్కుర్తి లోవ, బోడపాటి గోవిందు, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, స్థానిక ఎంపీటీసీలు పులగల రాఘవ, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, సకిలేటి రాము, పడాల దివాణం, వంగలపూడి రామారావు, ఎంపీటీసీలు కొంతం నరేష్, తమ్మిర్సి సత్యనారాయణ, యగదాసు శేఖర్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపిల్లి శ్రీను, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొంకిపూడి రామకృష్ణ, ఆయా గ్రామాల నాయకులు గుజ్జు గోవిందరెడ్డి, చిరంజీవిరెడ్డి, దేవవరపు వేంకటేశ్వరరావు, పల్లేల కృష్ణార్జునరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, పల్లేల వెంకట్ పాల్గొన్నారు.


హోలీ.. ఆనందాల కేళీ

- ఎన్ఏడీలో సంబరాలు
- పాల్గొన్న బొత్స ఝాన్సీ, ఆనంద్ కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు వుడా కాలనీలో ఆదివారం రాత్రి హోలీ వేడుకలు కోలాహలంగా జరిగాయి. కాలనీలోని పటేల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి పాల్గొన్నారు. పటేల్స్ కుటుంబీకులతో కలసి వారు సంప్రదాయబద్ధంగా వేసిన హోలీ దహన్‌లో పాల్గొన్నారు. పటేల్స్ సమాజ్‌కు చెందిన పెద్దలు, పిల్లలు, మహిళలు అంతా ఒక చోటకు చేరి, హోలీ దహన్ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ గీతాలను ఆలపించారు. అట్టహాసంగా జరిగిన హోలీ సంబరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అన్ని మతాలు, వర్గాల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వేడుకల్లో భాగస్వాములం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



వేడకల్లో పాల్గొన్న బొత్సఝాన్సీ, ఆనంద్‌కుమార్, శ్రీధర్, రమాకుమారి



బీచ్‌రోడ్డులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మార్వాడీలు

ఘనంగా హోలికా దహనం

బీచ్‌రోడ్డు: చెడుపై మంచి విజయానికి ప్రతీకగా ఆదివారం ఆర్.కె.బీచ్‌లో ఉత్తరాది ప్రజలు హోలికా దహనం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తీరానికి చేరుకుని.. పిడకల దండను వేసి అందులో హోలికా అనే రాక్షసిని బొమ్మ వేసి దహనం చేశారు. దహనం నిర్వహణలో మార్వాడీలు హోలికా ముఖ్య పాత్ర పోషిస్తారు. ఈ పండగ వారి సంస్కృతి, సంప్రదాయాల్లో ఓ ముఖ్యమైన భాగం.

క్లుప్తంగా

ఘనంగా విజయదుర్గాంబిక ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాకలో విజయదుర్గాంబిక అమ్మవారి దేవాలయం 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

వలంటీర్ మృతికి సంతాపం



శాంతి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జాజుల రమేష్

అనకాపల్లి: స్థానిక భీమునిగుమ్మం 8వ సచివాలయం వలంటీర్ కశింకోట శాంతి అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందింది. ఆమె దహన ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో నిబద్ధతతో పనిచేసిన వలంటీర్ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని త్వరలోనే అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పరిశీలకుడితో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల



చినఅప్పలనాయుడుని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయనికి విచ్చేసిన ఆయన్ని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శాలువా, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పరిశీలకుడు మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరారు. మరో 50 రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేసి, పార్టీకి ఘన విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకుడు మలసాల కుమార్‌రాజా పాల్గొన్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లి :జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 292 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 246 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
గామి	:	సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	:	సత్యనారాయణస్క్రీన్-2
అనన్య	:	షిర్డిసాయి
ఓం భీం బుష్	:	పర్తిసాయి
యమధీర	:	వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్	:	శ్రీసత్య
భీమా	:	రామచంద్ర

జమాదులపాలెం

ఊరు తీరు మారింది చూడు

మండలంలో మారుమూల గ్రామం జమాదులపాలెం. మూడు వేల మందిజనాభా. గత ప్రభుత్వాల్లో ఈ గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పాలంటే.. మూడు దశాబ్దాల క్రితం ఏర్పడ్డ బీసీ కాలనీ, రెండు దశాబ్దాల నాటి సీమలవాక కాలనీకి ప్రస్తుత ప్రభుత్వం వచ్చాకే సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించారంటేనే.. విషయం అర్థమైపోతుంది. సచివాలయం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు బహుళ ప్రయోజన సౌకర్య గోదాము(ఎంపీఎఫ్‌సీ), ఇళ్లు లేని పేదలకు జగనన్న కాలనీతో గృహవసతి, ఇంటింటికీ కుళాయిలు ఇలా ప్రతి అభివృద్ధి కార్యక్రమం ఈ ప్రభుత్వంలో మొదలైనవే..!



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం



నాడు-నేడులో హైస్కూల్ సుందరీకరణ



సిద్ధమైన అంగన్‌వాడీ భవనం



రూ.40 లక్షలతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ



సీమలవాక కాలనీకి నిర్మించిన సిమెంట్ రోడ్డు

కశింకోట: గత ఐదేళ్ల కాలంలో జమాదులపాలెం గ్రామ పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధికి నోచుకుంది. ప్రధాన వసతులకే సుమారు రూ.2 కోట్ల మేర ఈ ప్రభుత్వ హయాంలో వెచ్చించారు. దీంతో రోడ్లు, కాలువలు, పాఠశాల భవనం అందంగా రూపుదిద్దుకున్నాయి. మండలం మొత్తానికి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ఎంపీఎఫ్‌సీ గోదాము ఇక్కడే ఉంది. గ్రామ సచివాలయం ఏర్పాటుతో జమాదులపాలెంతపాటు, విసన్నపేట, రామన్నపాలెం గ్రామాలకూ ఇక్కడి నుంచే సేవలు అందుతున్నాయి.

అభివృద్ధికి చిరునామా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామం రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. మౌలిక వసతులన్నీ సమకూరాయి. రూ.40 లక్షల నాబార్డ్ రుణంతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గోదాము ఇటీవలే ప్రారంభించారు. రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులు పాడైపోతాయన్న భయం లేకుండా పోయింది.

- సీమలవాక కాలనీకి రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. రెండు దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల ఆకాంక్ష ఈ ప్రభుత్వంలోనే నెరవేరింది.
- బీసీ కాలనీలో రూ.12 లక్షలు వెచ్చించి మురుగు నీటి కాల్వలను నిర్మించారు.
- స్థానిక హైస్కూల్‌ను నాడు-నేడు నిధులు రూ.23 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. స్కూల్ వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చేశారు.
- సీమలవాక కాలనీ, బీసీ కాలనీల్లో చెరో రూ.5 లక్షలు వెచ్చించి బోర్లు, పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయాన్ని మెరుగుపర్చారు.
- నవరత్నాల్లోని పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రెండు లేఅవుట్లను ఏర్పాటు చేసి, 134 మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే చాలా మంది ఇళ్లు నిర్మించుకుని, నివాసం ఉంటున్నారు. సొంతింటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.54 లక్షలతో టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించాల్సి ఉంది.
- జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రెండు కిలో మీటర్ల పొడవు ఉన్న రోడ్డును వెడల్పు చేశారు. దీన్ని తారు రోడ్డుగా అభివృద్ధి చేయాల్సి ఉంది.
- రూ.25 లక్షలతో నిర్మాణం చేపట్టిన సచివాలయ భవనం నిర్మాణ దశలో ఉంది. గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ఈ ప్రభుత్వంలోనే జరిగిందని ప్రజలు ఆనందంగా చెప్తున్నారు.

అభివృద్ధి పనులు-వెచ్చించిన మొత్తం

బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (ఎంపీఎఫ్‌సీ)	రూ.40 లక్షలు
సిమెంట్ రోడ్ల నిర్మాణం	రూ.20 లక్షలు
సిమెంట్ కాలువల నిర్మాణం	రూ.12 లక్షలు
అంగన్‌వాడీ కేంద్ర భవనం	రూ.15 లక్షలు
బోర్లు, పైప్‌లైన్లు(సీమలవాక, బీసీ కాలనీల్లో)	రూ.10 లక్షలు
నాడు-నేడులో హైస్కూలు అభివృద్ధి	రూ.23 లక్షలు
ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు	రూ.54 లక్షలు
సచివాలయ భవనం	రూ.25 లక్షలు

రహదారి కష్టాలు తీరాయి



20 ఏళ్లుగా జమాదులపాలెం గ్రామంలోని సీమల వాక కాలనీకి చెందిన ఒమ్మి దుర్గాప్రసాద్ ఎలక్ట్రీషియన్. తండ్రి గోవింద్. రెండు దశాబ్దాలు క్రితం నిర్మించిన కాలనీకి మెటల్ రోడ్డు ఉండటం వల్ల ఏ మాత్రం వర్షం పడినా రాకపోకలకు ఇబ్బంది పడే పరిస్థితి. ఈ నేపథ్యంలో రెండున్నరేళ్ల క్రితం రూ.20 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీంతో రహదారి సదుపాయం మెరుగుపడింది. రాకపోకలకు మార్గం సుగమమైంది. దీంతో రహదారి కష్టాలు తీరాయని దుర్గాప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు.

– ఒమ్మి దుర్గాప్రసాద్, సీమలవాక కాలనీ

సొంతింటి కల నెరవేరింది



ఉండటానికి సొంతం అనుకునే ఓ ఇల్లుంటే చాలు. కలో గంజో తాగి బతికేయొచ్చు. స్థిరమైన ఆదాయం లేని బతుకులు మావి. ముగ్గురు పిల్లలు. అందులో ఇద్దరు ఆడ పిల్లలు. అద్దె ఇళ్లలో బతుకులెలా ఉంటాయో ఏళ్ల తరబడి అనుభవం మాది. చాలాసార్లు అద్దె కట్టుకోవడం కనాకష్టంగా మారేది. జగనన్న ప్రభుత్వంలో ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందించారు. నిర్మాణ సామగ్రి కూడా రాయితీ ధరలకు ఇప్పించారు. మా సొంతింటి కల ఇన్నేళ్లకు తీరింది.

– ఇసరపు అప్పలకొండ, జమాదులపాలెం

వేడుకగా మట్టల ఆదివారం



కశింకోట ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టల ప్రదర్శన

కశింకోట: స్థానిక క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతబయలలోని ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చి, గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంల ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలను సంప్రదాయంగా పూలతో అలంకరించి, గ్రామ వీధుల్లో క్రీస్తు గీతాలాపనతో వేర్వేరుగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బాప్టిస్టు చర్చి పాస్టర్ సన్నీ జేమ్స్, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం పాస్టర్ వై.సునీల్‌బాబు, అధ్యక్షుడు కె.శ్యామలరాజు, సభ్యులు మదన్, మధుసూదన్, కృపావరం, జాన్‌మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



కొత్తగా ఎన్నికైన ఏఐటీయూసీ జిల్లా కమిటీ

అనకాపల్లి: జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షునిగా పెంటకోట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా వైఎస్ భద్రం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గనిశెట్టి ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా ఎం.అర్జున్‌కుమార్, కోన లక్ష్మణ, ప్రధాన కార్యదర్శిగా రాజాన దొరబాబు, కార్యదర్శులుగా ఎం.అప్పలరాజు, కండిపల్లి త్రినాథ్, కోశాధికారిగా రెడ్డిపల్లి అప్పలరాజుతో పాటు 13 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు.

కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు



రోగిని పరీక్షిస్తున్న హోమియో వైద్యుడు జోగినాయుడు

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని ప్రముఖ హోమియో వైద్యుడు విల్లూరి జోగినాయుడు, దంత వైద్యురాలు సంజన సూచించారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత హోమియో, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల తరువాత హోమియో వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. రహదారులపై ఫాస్ట్‌ఫుడ్‌లు తీసుకోవడం ద్వారా పలు వ్యాధులకు గురయ్యే పరిస్థితి వస్తోందన్నారు. వారానికి రెండు సార్లు ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో తాగునీటిని తీసుకువెళ్లాలన్నారు. ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ప్రతి ఆదివారం ఇదే ప్రాంతంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పీజే నాయుడు, రోటరీ గవర్నర్ బుద్ధ రమణాజీ, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవాంగ సంఘం అధ్యక్షుడిగా వరప్రసాద్



చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం నూతన కమిటీ

అనకాపల్లి:స్థానిక చిన్నరాజుపేట చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రెడ్డి వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా బూడిద నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ముప్పన లింగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బాసిన బాలగురూజీ, వేమన సంతోష్, కోశాధికారిగా ముప్పన వాసు, సంఘ ప్రచార కమిటీ సభ్యులుగా బల్లా నాగభూషణం, కార్యవర్గ సభ్యులుగా చింతల నారాయణరావు, రెడ్డి అజయ్, అలంక బెన్నయ్య, దేశెట్టి చినవెంకటరావు, సంఘ గౌరవ సలహాదారులుగా రెడ్డి నారాయణరావు, వుప్పు సాంబమూర్తి, కాలెపు తాతాజీ, ముప్పన సూర్యనారాయణలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికైన కమిటీ రెండేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తిస్తుందన్నారు. కమిటీ సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. ఈ ఏడాది సంఘంలో నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

తనిఖీలు విస్తృతం

- అదనపు ఎస్పీ విజయభాస్కర్



చెక్‌పోస్టు వద్ద పోలీసు బలగాలకు సూచనలిస్తున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్



వాహనాల తనిఖీలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్

పరవాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యలో నిర్దేశించిన చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ సిబ్బందిని ఆదేశించారు. దేశపాత్రునిపాలెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆదివారం సందర్శించారు. వాహనాల తనిఖీలో సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి, ఉచిత కానుకల పంపిణీని అడ్డుకోవడానికి ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలు పటిష్ఠ తనిఖీలు జరపాలని అదనపు ఎస్పీ విజయభాస్కర్ సూచించారు. అదనపు ఎస్పీ వెంట పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు ఉన్నారు.

ఆరంభంలో గుర్తిస్తే క్షయ నివారణ సులభం



తాళ్లపాలెంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట: ప్రారంభ దశలో గుర్తించి, చికిత్స అందిస్తే క్షయ వ్యాధిని నివారించవచ్చని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2 వారాలకు పైగా దగ్గు, జ్వరం, కఫంలో రక్తం పడుట, క్రమేపీ బరువు తగ్గడం తదితర అనుమానిత లక్షణాలున్న వారు సమీపంలోని పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 2వ వైద్యాధికారి ఎ.మనీషా, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్ఆర్‌కేజీ నర్సింహారావు, ఎస్టీఎల్ఎస్ పి.రాధిక, టీబీ హెచ్‌వీ ఐ.రోజా రమణి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపల్లెమ్మ జాతర



శ్రీ పోలిపల్లెమ్మ తల్లి ఆలయం వద్ద అన్నసమారాధనలో భక్తులు

తుమ్మపాల: మండలంలోని రేబాక గ్రామం శ్రీ పోలిపల్లెమ్మ తల్లి జాతర మహోత్సవంతోపాటు ఆదివారం అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ పోలిపల్లెమ్మ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం చిన్నపిల్లలకు సైకిల్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తి ఊరేగింపు



కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి:స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 2వ పౌర్ణమి పురస్కరించుకుని విశేష పూజలు జరిపారు. నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నవకలశ స్నపనము, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో శతజయంతి ఉత్సవం చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



నర్సింగరావుపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్, కార్పొరేటర్ సునీత



బర్మాకాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణి మలసాల నివేదిత



81వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్‌కు హారతి ఇస్తున్న మహిళ

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలైన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, భరత్‌కుమార్ సతీమణి నివేదిత ఓటర్లను అభ్యర్థించారు. వార్డు పరిధిలోని పాత బర్మాకాలనీ, నరసింగరావుపేటలో ఆదివారం గడప గడపకూ వెళ్లి సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయని విధంగా సంక్షేమ పథకాలను బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సీఎం జగన్ ప్రభుత్వం అందించిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలుకు నోచుకుందన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకునేందుకు స్థానిక అభ్యర్థి భరత్‌కుమార్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్, పార్టీ నాయకులు కుండల రామకృష్ణ, మునూరు శ్రీనివాసరావు, కూండ్రపు సత్తిబాబు, రాజాన శ్రీను, అల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

81వ వార్డులో ఎన్నికల ప్రచారం

అనకాపల్లి: దేశ చరిత్రలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందని నమ్మితేనే ఓటేయండని ఓటర్లను అడిగిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక గవరపాలెం 81వ వార్డు పరిధిలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చి, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలను అందించిన సీఎం జగనేనన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ కేఎం నాయుడు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మున్నూరు శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, జిల్లా కార్యదర్శి పిల్లా రాజు, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు శ్రీధరాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బట్లపూడి మోదకొండమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గ్రామ దేవత ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని బట్లపూడి గ్రామంలో శ్రీ మోదమాంబ అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండేళ్లకోసారి నిర్వహించే మోదమాంబ అమ్మవారి ఉత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.